# నమస్తే తెలంగాణ
## ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 18 జనవరి 2024 | KHAMMAM







# ఒకటి.. రెండు తడులకు నీరు ఇవ్వగలం!

### రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి



తన క్యాంప్ కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, జనవరి 17: ఎగువన సాగర్ డ్యాం డెడ్ స్టోరేజీకి వచ్చినందున జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ పాత కాలువ పరిధిలోని కూసుమంచి, నేలకొండపల్లి మండలాల ఆయకట్టుకు ఒకటి.. రెండు తడులకు తప్ప సాగు నీరు సరఫరా చేయలేమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆయకట్టు రైతులు బుధవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి సాగునీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. పంటలకు సరిపడినంత సాగుజలాలు సరఫరా చేయాలని ప్రభుత్వానికీ ఉందన్నారు. ఒకవేళ నీరు ఇస్తామని మాట ఇస్తే, రైతులు ఆశలు పెట్టుకుని నాట్లు పూర్తి చేస్తారన్నారు. కానీ ఆ తర్వాత సర్కార్ నీరు ఇవ్వకపోతే ఇబ్బంది పడతారన్న ఆలోచనతో ఒకటి రెండు తడులకు తప్ప నీరు ఇవ్వలేమని స్పష్టం చేస్తున్నామన్నారు. రైతులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ నీరు విడుదలైతే ఆ నీటిని రైతులు పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. త్వరలోనే నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు.

# మినీ.. ఇక మెయిన్

- జిల్లాలో అంగన్‌వాడీలు అప్‌గ్రేడ్
- ఈ నెల నుంచే మినీ టీచర్లకు కొత్త జీతాలు
- జిల్లాలో పెరిగిన 626 ఆయా పోస్టులు
- నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న స్థానిక మహిళలు



కొత్తగూడెం ప్రాజెక్టులో అప్‌గ్రేడ్ అయిన మినీ అంగన్‌వాడీ కేంద్రం

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలో నడుస్తున్న మినీ అంగన్‌వాడీలు మెయిన్ అంగన్‌వాడీలుగా మారాయి. దీంతో మినీ అంగన్‌వాడీ టీచర్లు మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా అప్‌గ్రేడ్ అయ్యారు. ఈ ప్రతిపాదన గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పురుడు పోసుకోగా.. ఎన్నికల నేపథ్యంలో అమలు కాలేదు. ప్రస్తుతం ఏర్పడిన కొత్త ప్రభుత్వంలో మెయిన్ అంగన్‌వాడీలుగా మారడంతో టీచర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**కుటుంబాల సర్వే ఆధారంగా మార్పు**

ఇప్పటివరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు 1,434 ఉండగా.. మినీ కేంద్రాలు 626 ఉన్నాయి. మొత్తం 11 ప్రాజెక్టుల్లో అంగన్‌వాడీ సేవలు పిల్లలు, బాలింతలు, తల్లులకు అందుతున్నాయి. తక్కువ కుటుంబాలు, రెవెన్యూ గ్రామాలకు ఆవాసాలు దూరంగా ఉండడం కారణంగా అప్పట్లో(పదేళ్ల క్రితం) మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడ ఉన్న తల్లులు, పిల్లలకు ఫీడింగ్‌తో పాటు ఇమ్యునైజేషన్ కోసం ఏర్పాటు చేసిన ఈ మినీ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కుటుంబాలు పెరగడంతో ప్రస్తుతం సేవలు చేయడం ఇబ్బందికరంగా మారింది. మినీ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా, టీచర్ పోస్టును ఒకరే నిర్వహించాలి. కుటుంబాలు సంఖ్య పెరిగిన తర్వాత సేవలు అందించడం ఇబ్బందిగా ఉన్నందున



మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని కమిషనర్ దృష్టికి రావడంతో అది ప్రభుత్వ పరిశీలనకు వెళ్లి గ్రీన్‌సిగ్నల్ పడింది. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అంగన్‌వాడీ టీచర్లకు సమ్మె సమయంలో హామీ ఇచ్చారు. కొత్త పీఆర్‌సీలో వేతనాలు అందరిలాగే పెంచడంతోపాటు మినీలను అప్‌గ్రేడ్ చేస్తామని ప్రభుత్వ అనుమతి కూడా తీసుకున్న సంగతి తెలిసిందే.

**పెరగనున్న ఆయా పోస్టులు**

మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్ కావడంతో కొత్తగా ఆయాల పోస్టులు పెరిగే అవకాశాలు ఉన్నాయి. మినీ అంగన్‌వాడీ టీచర్ల జీతం పెరిగింది. ప్రస్తుతం తీసుకుంటున్న జీతం రూ.7,800 కాగా.. ఈ నెల నుంచి రూ.13,650 తీసుకోనున్నారు. దీంతో మినీ టీచర్లలో ఆనందం వెల్లివిరుస్తున్నది. ఇదేకాక కొత్తగా ఆయా పోస్టులు పెరగడంతో స్థానిక మహిళలు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఆయా పోస్టులకు త్వరలో నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు సమాచారం.

**ఇవీ నిబంధనలు**

మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చడంలో ఆ శాఖ కొన్ని నిబంధనలను విధించింది. గిరిజన ప్రాంతాల్లో 300 కుటుంబాలకు పైగా ఉన్న గ్రామంలో ఉన్న సెంటర్‌ను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంగా చేయాలని నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతం, అర్బన్ ఏరియాలో 400 కుటుంబాలు ఉన్న సెంటర్లను ప్రధాన సెంటర్లగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికే సర్వే చేసిన సీడీపీవోలు మినీ కేంద్రాల సర్వే రిపోర్ట్‌ను జిల్లా కార్యాలయానికి పంపగా అక్కడ నుంచి కమిషనరేట్‌లో పరిశీలన చేసి అప్‌గ్రేడ్‌కు అనుమతి ఇచ్చారు.

### చాలా ఆనందంగా ఉంది



మినీ అంగన్‌వాడీ సెంటర్ టీచర్‌గా చాలా కాలంగా పని చేస్తున్నాను. చాలా సార్లు ధర్నాలు కూడా చేశాం. అందరితో సమానంగా విధులు నిర్వహిస్తున్నాం. కుటుంబాల సంఖ్య కూడా పెరిగింది. మా కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చడం చాలా సంతోషంగా ఉంది. మెయిన్ కేంద్రాలు చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. దీనివల్ల కొత్తగా వచ్చే హెల్పర్లకు ఉపాధి లభించనున్నది.

**– బానోత్ జ్యోతి, మినీ అంగన్‌వాడీ టీచర్, గట్టుమళ్ల, లక్ష్మీదేవిపల్లి మండలం**

### వచ్చే నెల నుంచి కొత్త జీతాలు



మినీ అంగన్‌వాడీ టీచర్లు గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్నారు. వాళ్ల సర్వేలో కుటుంబాలు పెరిగాయి. మెయిన్ చేయమని అడిగారు. సంఘాలు కూడా వినతిపత్రాలు ఇచ్చారు. గతంలో ప్రభు త్వం నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. కొత్తగా వచ్చిన ప్రభుత్వం వారికి తీపి కబురు అందించింది. వారందరిని మెయిన్‌గా మార్చారు. జీవో వచ్చింది. జనవరి నెలకు సంబంధించి పెరిగిన జీతం వారికి వస్తుంది. ఆయా కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీ అవుతున్నాయి. వాటిని త్వరలో భర్తీ చేసే అవకాశం ఉంది. ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం.

**– విజేత, జిల్లా సంక్షేమాధికారి, భద్రాద్రి కొత్తగూడెం**

# పట్టభద్రులు ఓటు హక్కు పొందాలి

### ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్



మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, జనవరి 17: వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో ఉప ఎన్నిక జరుగనున్న నేపథ్యంలో జిల్లాలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందాలని కలెక్టర్ వీపీ గౌతమ్ విజ్ఞప్తి చేశారు. ఖమ్మంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఓటు హక్కు నమోదుపై రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఏఈఆర్వోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 1-11-2020 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఓటు వేసేందుకు అర్హులన్నారు. గ్రాడ్యుయేట్లు ఫారం-18 నింపి ఓటు హక్కు పొందాలన్నారు. ఫిబ్రవరి 24న ఓటర్ జాబితా డ్రాఫ్ట్‌లను ప్రకటిస్తామన్నారు. వీటిపై ఇదే రోజు నుంచి మార్చి 14వ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. మార్చి 29న అభ్యంతరాలను పరిష్కరిస్తామన్నారు. ఏప్రిల్ 4న తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. ప్రస్తుతం గ్రాడ్యుయేట్‌గా నమోదు అయిన వారూ, కొత్తగా నమోదు అయ్యేవారూ కొత్తగా నమోదు కావాలన్నారు. మాన్యువల్ లేదా వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత పత్రంతో పాటు గెజిటెడ్ అధికారితో అటెస్టెడ్ చేయించాలని సూచించారు. దీంతోపాటు పాస్‌ఫొటో, అసెంబ్లీ నియోజకవర్గ ఎపిక్ కార్డ్ జిరాక్సును జత చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఖమ్మం, కల్లూరు రెవెన్యూ డివిజన్ అధికారులు గణేశ్, అశోక్‌చక్రవర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.వి.అప్పారావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.మాలతి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి విద్యాచందన, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాంబాబు, మాస్టర్ ట్రైనర్ శైలేందర్, పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీవోలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల నిర్వహణలో జాప్యం వద్దు

### అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న పనులకు అంతరాయం కలగొద్దు

### అధికారుల సమీక్ష సమావేశంలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల




కొత్తగూడెం ఐడీవోసీలో అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 17 (నమస్తే తెలంగాణ): ప్రజల అవసరాల కోసం చేపట్టిన పనుల్లో జాప్యం చేయవద్దని కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయం, మిషన్ భగీరథ, విద్యుత్, మున్సిపల్ శాఖల్లో ఉన్న పెండింగ్ పనుల గురించి ఆయా శాఖల అధికారులతో ఐడీవోసీలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న పనులకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంజూరు చేసిన పనులను అటవీశాఖ అధికారులు ఆయా శాఖల అధికారులతో కలిసి పరిశీలించాలని సూచించారు. ఏదైనా సమస్య వస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో గిరివికాసం పథకం కింద మంజూరైన పనులకు వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. తాగునీటి సమస్య కూడా లేకుండా చూడాలన్నారు. మారుమూల ప్రాంతాల్లోని మొబైళ్లకు టెలికం సేవలు అందాలన్నారు. ఇందుకోసం సెల్ టవర్ల నిర్మాణానికి భూమిని ఇప్పించాలన్నారు. ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పనుల అవసరాల కోసం అటవీ భూములకు అనుమతుల కోసం జిల్లా స్థాయి కమిటీ ఆమోదం అవసరమని అన్నారు. అందుకని ఆయా పనుల ప్రతిపాదనలను ఐటీడీఏకు పంపాలని సూచించారు. పోడు పట్టాలున్న గిరిజన రైతులు సాగుచేస్తున్న పామాయిల్ తోటలకు, బోరుబావులకు అవసరమని అన్నారు. వాటికి విద్యుత్ సౌకర్యం అవసరమైనందున వాటి ఆమోదం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదనరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు కిష్టాగౌడ్, భీమ్లా, అభిమన్యుడు, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# విజబుల్ పోలీసింగ్‌కి ప్రాధాన్యమివ్వాలి

### అర్జీదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి: ఎస్పీ రోహిత్‌రాజు



వన్ టౌన్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, జనవరి 17: విజబుల్ పోలీసింగ్‌కి ప్రాధాన్యమిస్తూ పోలీసు శాఖపై ప్రజల్లో మరింత భరోసాని పెంచాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. తొలుత పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విజబుల్ పోలీసింగ్‌కి ప్రాధాన్యమివ్వాలని, స్టేషన్‌కు వచ్చే అర్జీదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాల్లో పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ నిరంతరం వారు ఆ ప్రాంతాల్లో బీట్ నిర్వహించేలా ఎస్‌హెచ్‌వోలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చొరవ తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. అసాంఘిక శక్తులు, రౌడీషీటర్లపై నిఘా ఉంచి వారు శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ పోలీస్ అధికారి, సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవలందించాలని తెలిపారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.కరుణాకర్, ఎస్సైలు సాయికిశోర్‌రెడ్డి, విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కెట్‌లో క్రయవిక్రయాలు షురూ..

### మిర్చి క్వింటా ధర రూ.21,300



ఖమ్మం మిర్చి యార్డుకు రైతులు తీసుకొచ్చిన బస్తాలు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 17 : ఐదు రోజుల వరుస సెలవుల అనంతరం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం క్రయవిక్రయాలు ప్రారంభమయ్యాయి. మిర్చి యార్డుకు రైతులు భారీగా సరుకు తీసుకొచ్చే అవకాశం ఉన్నదని అధికారులు, వ్యాపారులు భావించినా ఆశించిన మేర విక్రయానికి రాలేదు. సెలవులకు ముందు మిర్చి ధర పడిపోవడం తదితర కారణాల వల్ల యార్డుకు 20 వేల బస్తాలు మాత్రమే విక్రయానికి వచ్చినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. ఉదయం జెండా పాట సమయానికి వివిధ జిల్లాల నుంచి 18,803 బస్తాల మిర్చి, 4,491 బస్తాల పత్తి, 14 బస్తాల పెసర, తాలు మిర్చి మరో 2,752 బస్తాలను రైతులు మార్కెట్‌కు తరలించారు. మిర్చి జెండా పాటలో గరిష్ట ధర క్వింటా రూ.21,300 పలుకగా.. మధ్య ధర క్వింటా రూ.18వేలు కాగా.. కనిష్ట ధర రూ.6,300 పలికింది. పత్తి పంట ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో గరిష్ట ధర క్వింటా రూ.6,700 కాగా.. మధ్య ధర రూ.6,300, కనిష్ట ధర రూ.5,500 పలికింది. తాలు రకం మిర్చి గరిష్ట ధర రూ.12వేలు పలికింది. పెసర పంట గరిష్ట ధర క్వింటా రూ.5,600 చొప్పున ధర నిర్ణయించి ఖరీదుదారులు కొనుగోలు చేశారు. క్రయవిక్రయాలను మార్కెట్ కమిటీ గ్రేడ్-టూ అధికారి బజార్, అసిస్టెంట్ సెక్రటరీ వజీరుద్దీన్ పర్యవేక్షించారు.

# బ్రహ్మోత్సవాల పనులకు టెండర్ల ఆహ్వానం

భద్రాచలం, జనవరి 17 : భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో ఏప్రిల్ 17న జరిగే శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు వివిధ పనుల నిమిత్తం రిజిస్టర్డ్ సంస్థల నుంచి ఈ ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి టెండర్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చుని, ఈ నెల 31న ఉదయం 11 గంటల వరకు టెండర్లు దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం httpsG//tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు. కల్యాణ మండపం, పర్ణశాలలోని విగ్రహాలకు కలర్ పెయింటింగ్ కోసం రూ.9.80 లక్షలు, క్లాత్ డెకరేషన్, సెక్టార్ ఎంట్రన్స్ 8 గేట్లకు రూ.6.80 లక్షలు, గోదావరి తీరం వద్ద భక్తులకు తాత్కాలిక ఉచిత వసతి, కల్యాణ కట్ట వద్ద భక్తులు బట్టలు మార్చుకునేందుకు, లడ్డూ ప్రసాదం కౌంటర్లు, తలంబ్రాల కౌంటర్ల ఏర్పాటుకు రూ.9.80 లక్షలు, పూల డెకరేషన్ తదితర పనుల నిమిత్తం రూ.1.42 కోట్లకు టెండర్లను ఆహ్వానించినట్లు ఈవో పేర్కొన్నారు.

# 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, జనవరి 17 : ఐటీడీఏ పరిధిలోని గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందని, అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని గురుకులాల్లో మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

# మూడు సీఆర్పీఎఫ్ బేస్‌క్యాంప్‌లపై మెరుపుదాడి

- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ప్రతీకారేచ్ఛ
- జవాన్లు అప్రమత్తంగా ఉండడంతో తప్పిన పెనుప్రమాదం






ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా చింతవాగు వాగు- ధర్మారం సీఆర్పీఎఫ్ బేస్ క్యాంప్ పరిధిలో నేలపై పడి ఉన్న రాకెట్ లాంచర్

కొత్తగూడెం క్రైం/చర్ల, జనవరి 17: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులు ప్రతీకారేచ్ఛతో భద్రతా దళాలపై రాకెట్ లాంచర్లను ప్రయోగించారు. అప్రమత్తంగా ఉన్న సీఆర్పీఎఫ్ సిబ్బంది మావోయిస్టుల చర్యలను తిప్పికొట్టారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలిసిన వివరాల ప్రకారం.. తెలంగాణ సరిహద్దును ఆనుకుని ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పామేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొన్నేళ్ల నుంచి మూడు సీఆర్పీఎఫ్ బేస్ క్యాంప్‌లు నడుస్తున్నాయి. వాటిని టార్గెట్ చేస్తూ మావోయిస్టులు మంగళవారం రాత్రి క్యాంపులకు వెళ్లే రహదారులపై వృక్షాలు నరికి అడ్డుగా వేశారు. అనంతరం వాటిని దహనం చేస్తూ మంటలు ఎగసేలా చేశారు. అనంతరం ఏకకాలంలో మూడు బేస్‌క్యాంప్‌లపై బ్యారల్ గ్రానేడ్ లాంచర్ల (బీజీఎల్స్)ను ప్రయోగించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో మంటలు ఉవ్వెత్తున ఎగిశాయి. అప్రమత్తమైన సీఆర్పీఎఫ్ భద్రతా దళాలు అప్రమత్తమై మావోయిస్టుల విధ్వంసక చర్యలను తిప్పికొట్టాయి. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగకుండా జవాన్లు బయటపడ్డారు. మావోయిస్టుల ఉనికిని నిర్మూలించేందుకు 'ఆపరేషన్ ప్రహార్'లో భాగంగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కొద్దిరోజుల నుంచి పారా మిలిటరీ బలగాలతో దండకారణ్యంలో కూంబింగ్ నిర్వహిస్తున్నది. మరోవైపు భద్రతా దళాల కట్టడితో మావోయిస్టు పార్టీ అట్టుడికిపోతున్నది. ఈ నేపథ్యంలో తన ఉనికిని చాటుకునేందుకు పామేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూడు బేస్‌క్యాంప్‌లపై రాకెట్ లాంచర్లను ప్రయోగించినట్లు అక్కడి పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం దండకారణ్యంలో యుద్ధ వాతావరణం నెలకొన్నది. ఆయా ప్రాంతాలను ప్రత్యేక భద్రతా బలగాలు మోహరించి మావోయిస్టుల కోసం జల్లెడ పడుతున్నాయి. దాడిని ఎదుర్కొన్న మూడు బేస్ క్యాంపుల్లో చింతవాగు వాగు- ధర్మారం సీఆర్పీఎఫ్ బేస్ క్యాంప్ తెలంగాణ పరిధిలోని భద్రాద్రి జిల్లా చర్ల మండలానికి అత్యంత చేరువలో ఉంటుంది.



# బస్సులు కిటకిట



కొత్తగూడెం బస్టాండ్‌లో గుమిగూడిన ప్రయాణికులు

కొత్తగూడెం అర్బన్/ అశ్వారావుపేట టౌన్, జనవరి 17: సంక్రాంతి పండుగ సందర్భంగా సొంతూళ్లకు వచ్చిన వారంతా సెలవులు ముగియడంతో నగరాలు, పట్టణాలకు తిరుగు పయనమయ్యారు. దీంతో ఆర్టీసీ బస్సులు కిక్కిరుస్తున్నాయి. బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. కొత్తగూడెం బస్టాండ్‌లో బుధవారం ఇవే దృశ్యాలు కన్పించాయి. విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాల కోసం పట్టణాలు, నగరాలకు వెళ్లిన వారంతా సంక్రాంతి సెలవుల కోసం వారం రోజుల క్రితమే సొంతూళ్లకు చేరుకున్నారు. ఇన్ని రోజులూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. ఇప్పుడు సెలవులు ముగియడంతో తిరిగి పట్టణాలు, నగరాల బాట పడుతున్నారు. ఈ క్రమంలో బస్సులు కిక్కిరిస్తున్నాయి. కొత్తగూడెం పరిసర ప్రాంతాల ప్రజలంతా కొత్తగూడెం బస్టాండు నుంచి ప్రయాణించాల్సి ఉండడంతో వారంతా ఇక్కడికి చేరుకున్నారు. దీంతో కొత్తగూడెం బస్టాండ్ ప్లాట్‌ఫారాలు, పరిసర ప్రాంతాలు బుధవారం కిటకిటలాడాయి.